## సాదాసీదాగా మండల సమావేశం

**మునిపల్లి, డిసెంబరు 18, ప్రభాతవార్త:** ఎంపిపి అధ్యక్షులు శైలజా అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సాదాసీదాగా ముగిసింది. ఆయా శాఖల అధికారులు తమ ఎజండాలను సభలో చదివి వినిపించారు. సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకని మండల సభ్యులు అధికారుల తీరుపై విస్మయం వ్యక్తం చేశారు. చీలపల్లిలో విద్యుత్ సిబ్బంది తమ ఇంటి మీటరును తీసి వేరు వాళ్ల ఇంటికి బిగించారని మక్తక్యాసారం ఎంపిటిసి సభ్యులు లక్ష్మి నగేష్ ఆరోపించారు. తాము సక్రమంగా విద్యుత్ బిల్లులు చెల్లిస్తునాన అధికారులు కరెంట్‌ను కట్ చేస్తున్నారని మండిపడ్డారు. అంగన్ వాడి కేంద్రాల్లో చిన్నారులకు అందించే ఆహారం అశుభ్రంగా ఉంటోందని అధికారులు తరుచూ కేంద్రాలను పరిశీలించాలని కంకోల్ సర్పంచ్ విశ్వనాథం డిమాండ్ చేశారు. మండలంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, రోడ్ల మరమ్మత్తులు చేయించాలని పలు మార్లు కోరినా ప్రయోజనం లేకుండా పోయిందని మండల సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఉపాధ్యక్షులు కమ్రోద్దిన్, సర్పంచ్‌లు,ఎంపిటిసి సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

-జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**మెదక్ అర్బన్, డిసెంబర్18 ప్రభాతవార్త:**
ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ధరణికి సంబంధించిన సమస్యలపై, మున్సిపల్ పరిధిలో అనుమతులు, ఇతర ధృవపత్రాల జారీ, ఉపాధి, ఉద్యోగం వంటి అంశాలపై ఫిర్యాదులు, దళితబంధు, బీసీ బంధు, డబుల్ బెడ్‌రూంలు, పెన్షన్‌లు మొత్తం 87 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేటి ఫిర్యాదులలో ఎక్కువ ఫిర్యాదులు భూములకు సంబంధించినవని, ఉద్యోగం, ఉపాధి తదితర ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో పద్మశ్రీ, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో సాయిబాబా, డీఈవో రాధాకిషన్, డీడబ్ల్యూవో బ్రహ్మాజీ, డీఐఈవో సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

**వికలాంగురాలికి వీల్‌చైర్ అందజేత...**

వెల్దుర్తి మండలంలోని కుకునూర్ గ్రామానికి చెందిన పోతుల మల్లేష్ కూతురు పోతుల తేజశ్రీకి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు వీల్‌చైర్‌ను అందించారు. ప్రజావాణిలో పోతుల తేజశ్రీతో పాటు తన తండ్రి పోతుల మల్లేష్ ప్రజావాణి కార్యక్రమానికి హాజరై జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు విన్నవించుకున్నారు. తేజశ్రీ నడవలేని పరిస్థితిలో ఉందని, ఆమెకు 90 శాతం వైకల్యం ఉందని, పేదరికంలో ఉన్నామని, సహాయం చేయమని లిఖిత పూర్వకంగా దరఖాస్తును అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు తండ్రితో కలిసి తేజశ్రీ అందించారు. పూర్తిగా నడవలేని స్థితిలో ఉన్న తేజశ్రీని చూసి చలించిన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన వీల్‌చైర్ అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో పద్మశ్రీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

-రాబోయే మూడు నెలలు ఉపాధ్యాయులు సెలవు తీసుకోకుండా పని చేయాలి
-జిల్లాను రాష్ట్రంలోనే పదో తరగతి ఫలితాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలి
-జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ఉపాధ్యాయ అధికార వర్గాలను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలోని ఎంఈవోలు, ఎంఎన్ఓలు, సీహెచ్ఎస్, ఉపాధ్యాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే మూడు నెలలు ఏ ఒక్క ఉపాధ్యాయుడు సెలవు తీసుకోకుండా పని చేయాలన్నారు. పాఠశాలలో టిఎల్ఎంను ఒక పోస్టర్ మాదిరిగా కాకుండా పిల్లలకు పాఠ్యాంశం సులభంగా అర్థమయ్యే విధంగా టెక్నిక్ తరహాలో విద్యార్థులతో ఇంట్రాక్ట్ అయ్యే విధంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. జిల్లా అధికారి, మండల విద్యాధికారి,పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కింది స్థాయి సిబ్బంది సైతం రాబోయే మూడు నెలలకు సంబంధించి ప్రతి నెల వారీగా టూర్ డైరీని తయారు చేసుకొని సమర్పించాలన్నారు. తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ సంబంధిత పోర్టల్‌లో ప్రతి రోజు ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి, లక్ష్య్ యాప్‌లో విద్యార్థుల హాజరు శాతం ఇతరత్రా వివరాలను అప్లోడ్ చేయాలని యాప్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఉంటే డీఈవో దృష్టికి తీసుకురావాలన్నారు. డీఈవో రాష్ట్ర స్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించి సమస్య తెలిపి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత విద్యా సంవత్సరం మాదిరిగానే ఈ విద్యా సంవత్సరంలో సైతం సిద్దిపేట జిల్లాను రాష్ట్రంలోనే పదో తరగతి ఫలితాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. ప్రతి పాఠశాలలో లైబ్రరీ పీరియడ్ విధిగా కేటాయించాలన్నారు. జిల్లాలో ఇటుక బట్టీల వద్ద భవన కార్మికుల, ఇతరత్రా ప్రదేశాలలో పని చేసే తల్లిదండ్రుల పిల్లలు సైతం పాఠశాలకు రప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, అసిస్టెంట్ లెబర్ అఫీసర్ మహమ్మద్ వికార్ బాబ తదితరులు పాల్గొన్నారు.

# రైతుబిడ్డకు ఘన స్వాగతం

-పల్లవి ప్రశాంత్‌ను ముంచెత్తిన అభిమానులు



ప్రజ్ఞాపూర్‌లో అభిమానులకు అభివాదం చేస్తున్న పల్లవి ప్రశాంత్

**గజ్వేల్, డిసెంబర్ 18 (ప్రభాతవార్త):**
రెండు తెలుగు రాష్ట్రాలలో ఉర్రూతలూగించిన బిగ్‌బాస్ షోలో విజయం సాధించి గజ్వేల్ నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన పల్లవి ప్రశాంత్ సోమవారం తన గ్రామానికి విచ్చేసిన సందర్భంగా ప్రజ్ఞాపూర్ చౌరస్తా నుండి తన గ్రామం కొల్గూరు వరకు అభిమానులు, యువకులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం తెలిపారు. అన్నదాత బిడ్డకు జై కిసాన్ జై జవాన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. బిగ్‌బాస్ 7 సీజన్ లో ప్రవేశించి 105 రోజుల పాటు ఉండి తన కంటెస్టెంట్లతో పోటీపడి ఆదివారం జరిగిన చివరి బిగ్‌బాస్ షోలో విజయం సాధించారు. హౌజ్‌లో ఉన్న తోటి వారి నుంచి విమర్శలు వచ్చినా కుంగిపోకుండా ఆత్మవిశ్వాసంతో సాగడంతో మరింత క్రేజ్ వచ్చింది. ఇదిలా ఉండగా గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన పల్లవి సత్యనారాయణ, విజయ దంపతులకు నలుగురు సంతానం కాగా కుమారులు పల్లవి ప్రశాంత్, మహవీర్, వినయ్, కూతురు గౌతమిలు ఉన్నారు. ప్రశాంత్ 6వ తరగతి వరకు కొల్గూరులో, 10వ తరగతి వరకు ఏటిగడ్డకిష్టాపూర్‌లో చదువుకున్నాడు. గజ్వేల్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసి డిగ్రీ మధ్యలో ఆపివేసి తండ్రికి అండగా ఉంటూ కొల్గూరు గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. అప్పుడప్పుడు యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించి టిక్‌టాక్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలలో పోస్టులు చేసి అభిమానులను సంపాదించుకున్నారు. మొత్తంమీద పల్లవి ప్రశాంత్ తను అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు.

## శ్రీ విద్యాధరి క్షేత్రంలో వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవం

-ఘనంగా శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యుడి కళ్యాణం
-క్షేత్రానికి విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం



శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ మహోత్సవ దృశ్యం

**వర్గల్, డిసెంబర్ 18 (ప్రభాతవార్త):**
తెలంగాణ జిల్లాల్లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో సోమవారం శ్రీ సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేదపండితులు శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కాగా మొదటగా ఆలయ సభా మండపంలో అందంగా తీర్చిదిద్దిన కళ్యాణ వేదికపైకి శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహాలను అధిష్టింపజేశారు. అనంతరం సుమారు మూడు గంటల పాటు స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరశర్మ సిద్ధాంతి ప్రసంగిస్తూ శ్రీ మహా శివునికి అత్యంత ఇష్టమైన సోమవారం శ్రీ సుబ్రహ్మణ్య షష్టి రావడం అత్యంత ప్రాధాన్యత సంతరించుకోగా, తారకాసుర సంహారం కోసం దేవతల కోరిక మేరకు పరమశివుని అంశతో సర్వశక్తి మంతుడైన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి జన్మించి కారణరూపుడిగా ప్రసిద్ధికెక్కినట్లు చెప్పారు. స్వామి వారు పిలిస్తే పలికే దైవంగా ప్రసిద్ధికెక్కి కోరిన కోరికలు తీర్చే దైవంగా నిలిచి భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్నట్లు స్పష్టం చేశారు. శ్రీ సుబ్రహ్మణ్య ఆరాధన సర్వశుభాలనిస్తూ సంతానం ప్రాప్తి కలుగుతుందని, ఎంతో విశిష్టమైన సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా జరిగే శ్రీవల్లి దేవసేన కళ్యాణ మహోత్సవంలో భాగస్వాములైన భక్తులకు అంతా మంచి జరుగుతుందని అన్నారు. అంతేకాకుండా కాలసర్ప దోష నివారణకు సుబ్రహ్మణ్య ఆరాధన అన్ని విధాలా శ్రేయస్కరమని, రాహుగ్రహం అనుగ్రహం ఉంటుందని, లోక కళ్యాణార్థమై నిర్వహించిన శ్రీ సుబ్రహ్మణ్య స్వామి షష్టి మహోత్సవం ప్రతి ఒక్కరికి సత్ఫలితాలు ఇవ్వాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఆలయ అర్చకులు,వేదపండితులు,ఆలయ కమిటీ సభ్యులు,సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యలు పరిష్కరించుకోవడానికి గొప్ప కార్యక్రమం



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్లు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజావాణి గొప్ప కార్యక్రమం..సామాన్యులకు అందుబాటులో ఉండి తమ సమస్యలను విన్నవించుకొని పరిష్కరించుకోవడానికి ఒక చక్కని వేదిక అని జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాస్‌లు రెడ్డిలు అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన అనంతరం వారు మాట్లాడారు. సమస్యలతో ఎంతో నమ్మకంతో కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే విధంగా పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించడంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, డిఆర్‌డిఎ పిడి జయదేవ్ అరా ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి జిల్లాలో...**

**సంగారెడ్డి మున్సిపాలిటి, డిసెంబరు 18, ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాధురిలు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ధరఖాస్తు దారులకు సంబంధిత అధికారులు వెంటనే రిప్లై ఇవ్వాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు ఆలస్యంగా హాజరు కావడం పట్ల చంద్రశేఖర్ అసహనం వ్యక్తం చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజా విణిలో 108 దరఖాస్తులు వచ్చాయని, అందులో 83 రెవిన్యూ శాఖ, ఇతర శాఖలకు సంబంధించి 25 ధరఖాస్తులు వచ్చాయన్నారు. క్రిస్మస్ పండగను పురస్కరించుకుని జిల్లాలో క్రైస్తవులకు విందు భోజనాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కనెక్షన్‌లు లేనట్లయితే సంబంధిత డిఈ, ఏఈలకు వెంటనే నివేదిక అందించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ నగేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ధరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

## జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం



సంగారెడ్డిలో జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం అయిన అధికారులు

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 18, ప్రభాతవార్త:**
జాతీయ, రాష్ట్ర సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్‌రావు అధ్యక్షతన సోమవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె హనుమంతరావు ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి బ్యాంక్, ఇన్సురెన్స్, చిట్ ఫండ్స్ అధికారులతో ఈ నెల 30వ తారీఖున నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్‌రావు మాట్లాడుతూ 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నందు మోటారు వెహికల్ ఆక్సిడెంట్ కేసులు, బ్యాంర్ మొండి బకాయిలు, చిట్ ఫండ్ ఈపి కేసులు రాజీపడే అన్ని కేసులను త్వరితంగా పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్, ఇన్సురెన్స్, చిట్ ఫండ్స్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఏడుపాయల ఆదాయం రూ.53లక్షలు



ఏడుపాయల హుండీని లెక్కిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, డిసెంబరు 18, ప్రభాతవార్త:**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాలయ వనదుర్గా భవాని మాత ఆలయ హుండీని సోమవారం లెక్కించగా అమ్మవారికి భక్తులు 53లక్షల 36వేల రూపాయల 8వందల 80 రూపాయలను మొక్కుబడిగా చెల్లించుకున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజన, ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, పాలక మండలి చైర్మన్ సాతెల్లి బాలగౌడ్‌లు పేర్కొన్నారు. సోమవారం అమ్మవారి 80 రోజుల హుండీని శ్రీ బ్రమరాంభిక సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలోని గోకుల్ షెడ్‌లో దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రంగారావు పర్యవేక్షణలో లెక్కించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు మనోహర్, చక్రపాణి, వెంకటేశం, బాగారెడ్డి, యాదయ్య, మోహన్‌రావు, సాయిలు, పెంటయ్య, శ్రీనివాసరావు, ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అయ్యప్ప దేవాలయం లెక్కలు పక్కదారి పట్టలేదు

-ప్రతి చందాదారుడికి అకౌంట్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం
-వ్యక్తిగత కక్షలతో కాంగ్రెస్ పార్టీ పేరుతో ఆరోపణలు
-దేవాలయానికి రాజకీయాలు అంటగట్టవద్దు
-ఆలయ ప్రధాన గురుస్వామి, మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గురుస్వామి పల్లె జితేందర్‌గౌడ్

**రామాయంపేట, డిసెంబర్ 18, ప్రభాతవార్త :**
రామాయంపేట పట్టణంలో నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయం లెక్కలన్నీ పక్కాగా ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీ పేరుతో కొందరు చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవని స్థానిక అయ్యప్ప దేవాలయం ప్రధాన గురుస్వామి, స్థానిక మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ తెలిపారు. రామాయంపేట పట్టణంలోని అయ్యపనప దేవాలయం నిర్మాణం కోసం సేకరించిన విరాళాలు, ఆలయం వద్ద నిర్వహించిన ప్రైవేటు చిట్టీలలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన స్పందించారు. సోమవారం నాడు అయ్యపనప దేవాలయంలో మాలధారులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప దేవాలయానికి కమిటీ లేదు అనే విషయం పూర్తిగా అబద్ధమని, ఆలయ నిర్మాణం, నిర్వహణ కోసం చేసిన విరాళాలు, ఇతర మార్గాల ద్వారా వచ్చిన నిధులన్ని కమిటీ వద్ద ఉన్నాయని, లెక్కలన్నీ పక్కాగా ఉన్నాయన్నారు. ఆలయ అభివృద్ధికి, నిర్మాణం కోసం విరాళాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికి లెక్కలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, ఎవరైనా గుడికి వచ్చి అడతవచ్చన్నారు. వ్యక్తిగత కక్షలతో తనపై ఆధారాలు లేని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆలయాలకు, రాజకీయ పార్టీలకు సంబంధం ఏంటని, అయ్యప్ప దేవాలయానికి రాజకీయాలు అంటగట్టవద్దన్నారు. అవసరమైతే ఆలయ అభివృద్ధికి తన సొంత డబ్బు ఖర్చుచేయడానికి అయినా సిద్ధమన్నారు. కానీ అయ్యపన దేవాలయం డబ్బులు నేను ఎలా వాడుకుంటానని అన్నారు. అవసరమైతే అయ్యపన దీక్ష పూర్తయ్యాక రాజకీయాలు చేద్దామన్నారు. గురుస్వామిగా నేను ఆదర్శంగా ఉంటానని, ఎక్కడ కూడా తాను అవినీతికి పాల్పడలేదని తెలిపారు. అనవసరమైన ఆరోపణలు చేసి అయ్యప్ప స్వాముల మనోభావాలు దెబ్బతీయవొద్దని ఆయన సూచించారు. ఇప్పటికీ కూడా అయ్యప్ప దేవాలయం సంబంధించి మూల నిధి ఉందని దానితో వచ్చిన వడ్డీతో ఆలయ అభివృద్ధి నిర్వహణ చేపడుతున్నామన్నారు. అయ్యపనప దేవాలయానికి సంబంధించిన డబ్బులు మొదట తన వద్ద ఉన్న విషయం వాస్తవమేనని, అయితే ఈ మధ్యనే ఒక సంస్థకు రూపాయిన్నర మిత్తికి వారి వద్ద ఉంచినట్లు ఆయన వివరించారు. ఆలయానికి సంబంధించి బ్యాంక్ అకౌంటు తీయొచ్చు కదా అని ప్రభాతవార్త విలేకరి ప్రశ్నించగా, బ్యాంక్ అకౌంట్ లేదన్నారు. దేవాలయం డబ్బులు సురక్షితంగా ఉన్నాయని, ఆలయానికి సంపద బాగానే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలాధారులు మర్కు నగేష్ గురుస్వామి, మురికి కృష్ణమూర్తి గురుస్వామి, దారం నాగరాజు గురుస్వామి, దోమకొండ శ్రీనివాస్ గురుస్వామి, దోమకొండ వెంకటి, మల్లారెడ్డి, బోడపుంటి స్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారుల సమస్యలను చట్టప్రకారం పరిష్కరించాలి

-జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్




ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్

**మెదక్ అర్బన్, డిసెంబర్18 ప్రభాతవార్త:**
మెదక్ పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఒక ఫిర్యాదిదారుడు వారి గ్రామంలో తనకు 23 గంటల భూమి కలదని, వారి కుటుంబీకులు పాత గొడవలు దృష్టిలో పెట్టుకొని ఎవరిని కౌలు చేయనీయకుండా బెదిరింపులకు దిగుతున్నారని, వారితో ప్రాణ భయం పొంచి ఉందని, కావున తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయమని వెల్దుర్తి ఎస్ఐకి సూచించారు. అలాగే మరొక ఫిర్యాదిదారుడు గత 50 సంవత్సరాలుగా వారి తాతల కాలం నుండి జీవనాధారంగా బ్రతుకుతున్న భూమిలో దౌర్జన్యంగా వచ్చి జేసీబీతో కాలువ తీస్తున్నారని, ఎంత చెప్పినా వినకుండా ఆ భూమి మా పేరు పైనే ఉందని చెపుతూ కొట్టడానికి వస్తున్నారని, తనకు న్యా యం చేయాలని ఫిర్యాదుదారు కోరగా చట్టప్ర కారం ఫిర్యాదికి న్యాయం చేయమని వెల్దుర్తి ఎస్ ఐకి సూచనలు చేయడం జరిగింది. సోమవారం జిల్లా నలుమూలల నుండి పలు ఫిర్యాదులు రావడం జరిగింది.

## అందరికి అందుబాటులో ఉంటా

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మైనంపల్లి రోహిత్‌రావు

**చిన్నశంకరంపేట,డిసెంబర్ 18,ప్రభాతవార్త:** ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మెదక్ ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మొదటిసారిగా చిన్నశంకరంపేట పట్టణ కేంద్రానికి వచ్చిన రోహిత్‌రావుకు ఘన స్వాగతం పలికారు. అన్ని శాఖల అధికారులు శాలువా కప్పి,పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, అన్ని వ్యవస్థలను నాశనం చేసిందన్నారు. ఇప్పుడు అవినీతి రహిత పాలన అందించేందుకు వందశాతం కృషి చేస్తానని హామి ఇచ్చారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను పరిష్కంచాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు శాఖాపరమైన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తిసుకెళ్లగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు, పెన్షన్లు, ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలను అందిచేలా కృషి చేస్తానన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి తనకు సహయసహకారాలతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, రాత్రి,పగలు ఎప్పుడైనా సమస్యలను పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. మాటలతో కాదు చేతలతో పనులు చేసి చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యలక్ష్మీరెడ్డి,ఎంపీడీవో ప్రవీణ్, తహసీల్దార్ చంద్రశేఖర్, పట్టణ సర్పంచి రాజిరెడ్డి, సీడీపీవో స్వరూప, మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవీణ్, వైద్యాదికారి సాయి సింధూ, పశు వైద్యాధికారి గీతా మాలిక, రామాయంపేట సిఐ లక్ష్మీబాబు,పట్టణ ఎస్ఐ నారాయణ, చేగుంట ఎస్ఐ హరిష్,ఎక్సైజ్ ఎస్ఐ విజయ సిద్ధార్థ,మండల విద్యాధికారి బుచ్చయ్య నాయక్,ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ సాయి నిఖిలా ఆర్టీసీ ప్రతినిధి లాలు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సత్కరించిన నాయకులు

**బెజ్జంకి, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్‌గౌడ్ హైదారాబాద్ సచివాలయంలోని తన కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం మండల పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార ్యక్రమంలో నాయకులు చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, గూడెల్లి శ్రీకాంత్‌రెడ్డి, రొడ్డ మల్లేశం, ప్రశాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్



ఏడుపాయల అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్‌చెరు,డిసెంబర్ 18,ప్రభాతవార్త:** దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఏడుపాయల దుర్గాభవాని దేవాలయాన్ని సోమవారం ఆయన దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే జీఎంఆర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ సమీపంలో అమిన్‌పూర్ మండలం వడక్పల్లి గ్రామ సర్పంచి లలితా మల్లేష్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన షెడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమిన్‌పూర్ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, క్రిష్టారెడ్డిపేట సర్పంచి కృష్ణా, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

### రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో మల్లేష్‌గౌడ్ ప్రత్యేక పూజలు



.లింగాపూర్ లో జరిగిన శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ తదితరులు

**నర్సాపూర్, డిసెంబర్ 18.ప్రభాతవార్త:** మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలో నిర్వహించిన శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి జాతర ఉత్సవాలను ఆ గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈమేరకు సోమవారం బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఈ రేణుకా ఎల్లమ్మతల్లి జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈమేరకు ఆయన శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి కి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈ జాతర నిర్వాహకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ ను శాలూవాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

### మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత : డిఈ ప్రవీణ్‌చారి

**నర్సాపూర్, డిసెంబర్ 18.ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంతో పాటు నియోజకవర్గ పరిదిలోని పలు గ్రామాల్లో రెండు రోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరాపరా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ డిఈ ప్రవీణ్‌చారి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు సరాపరా అయ్యే బోర్పట్ల ప్లాంట్ ముందు వాల్స్ లీకెజీ అయ్యందని అన్నారు. దీంతో మిషన్ భగీరథ నీటి సరపరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. ఈ వాల్స్‌లను మరమ్మత్తులు చేయడానికి గాను కెండు రోజుల సమయం పడుతుందని ఆయన తెలిపారు. ఇందువల్ల నర్సాపూర్ పట్టణం తో పాటు నియోజకవర్గంలోని 450 గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిఫరా నిలిచిపోతుందని తెలిపారు. ఈమేరకు ప్రజలు ఈ వాల్స్‌ల మరమ్మత్తులు అయ్యేంత వరకు సహనం పాటించి సహకరించాలని మిషన్ భగీరథ డిఈ ప్రవీణ్‌చారి కోరారు.

### అయ్యప్ప దేవాలయ నమ.. అభయ స్వరూపాయ నమ

**నందిగామ డిసెంబరు18,ప్రభాతవార్త :** నందిగామ మండలం శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం హైదరాబాద్ ఈస్ట్ మారేడు పల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్ రామయ్య స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అంతకుముందు రామయ్య మాధవి దంపతులు గురు స్వామి హరిజీవన్ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదాన ప్రభు దంపతులను ఆలయ కమిటీ నిర్వాహకులు పూలమాలలు,శాలువాలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామయ్య మాట్లా డుతూ...అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, అందరికి మంచి జరగాలని అయ్యప్పను వేడుకున్నట్లు తెలిపారు.ఈ వేడుకల్లో ఎంపిటిసి దేపల్లే కుమారస్వామి గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేత పసుల బుచ్చయ్య,దేపల్లే అశోక్ గౌడ్,తుమ్మల నరసింహులు యాదవ్, జటావత్ లక్ష్మణ్ నాయక్,జంగయ్య గౌడ్,కృష్ణ యాదవ్, సంబ రాజు,శివ కుమార్ గౌడ్,పాల్గొన్నారు.

# ఆదమరిస్తే.. అంబులెన్స్ ఎక్కాల్సిందే!

**ఈ మలుపులు ప్రమాదానికి పిలుపులు**

**హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి**

**అధికారులకు మొరపెట్టుకుంటున్న గ్రామీణులు**



వీర్లపల్లికి వెళ్లే దారిలో మలుపు

**నందిగామ డిసెంబరు18,ప్రభాతవార్త :** నందిగామ మండలంలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే అంతర్గత రహదారులు దుస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బలా మారింది. నందిగామ పాత జాతీయ రహదారి నుండి అప్పారెడ్డి గూడ,వీర్లపల్లి వెళ్లే దారుల్లో ఉన్న మలుపులు అత్యంత ప్రమాదాకరంగా ఉన్నాయి. వీర్లపల్లికి వెళ్లే దారి మలుపులు వద్ద ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉంటే మేకగూడ నుండి సంఘీగూడ వెళ్లే వ్యవసాయ పొలాల మద్య రహదారుల మలుపులు రోడ్డుకు ఇరువైపులా చెట్లతో నిండి ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు అగుపించగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్న పట్టించుకునే దిక్కే కరువై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.మేకగూడ ముఖ్యకూడలి బిస్కెట్ కంపెనీ పరిశ్రమ నుండి పెంజర్ల వెళ్లే దారుల్లో మలుపులు అదమరిస్తే అంలే సంగతులు అంటున్నారు.ఈ ప్రమాదకర మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు గాని,రేడియం స్టిక్కర్లతో సూచిక బోర్డు లేక వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ప్రమాదకర మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని గ్రామీణులు కోరుతున్నారు.



మేకగూడ నుండి సంఘీగూడ వెళ్లే దారి మలుపు వద్ద ఇరువైపులా చెట్లతో నిండి ఉన్న దృశ్యం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు చంద్రశేఖర్‌గుప్త

## అంధత్వ నివారణే లయన్స్‌క్లబ్ లక్ష్యం

**ఆమనగల్లు, డిసెంబర్18, ప్రభాతవార్త:** అంధత్వ నివారణ కోసం లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో కృషి చేస్తుందని లయన్స్‌క్లబ్ డ్రిస్టిక్ట్ చైర్మన్ మెండేటి చంద్రశేఖర్‌గుప్త అన్నారు, సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఉచిత కంటి ఆరోగ్య శిబిరాలు, నేత్రదాన అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఆయన వివరించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉచిత కంటి ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేసింది. శిబిరానికి మంచి స్పందన లభించింది. దాదాపు 95మంది తమ నేత్రాలను ఉచితంగా పరీక్షించుకున్నారు. కంటి వైద్య నిపుణులు చంద్రశేఖర్‌గుప్త కంటి పరీక్షలు నిర్వహించి పలువురులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి తగు సలహాలు సూచనలు అందజేశారు. అలాగే 35మందికి ఆపరేషన్ల అవసరాన్ని గుర్తించగా, వారిని జిల్లా కేంద్రంలోని లయన్స్ రాంరెడ్డి ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఈసందర్భంగా పీఆర్‌ఓ పాష మాట్లాడుతూ ఉచిత ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. సమాజ శ్రేయస్సుకు పాటుపడుతున్న లయన్స్‌క్లబ్ సేవలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌ఓ ఎంపపాష, కొర్వి వెంకటయ్య, ఎంగలి బాలకృష్ణ, కొండల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉచిత షుగర్ పరీక్ష శిబిరానికి విశేష స్పందన



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణుల బృందం

**ఆమనగల్లు, డిసెంబర్18, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని ఏవిఎస్ క్లీనిక్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత షుగర్ పరీక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో దాదాపు 280 మంది పాల్గొని షుగర్ పరీక్షలు పొందారు. షుగర్ వ్యాధి బారినపడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలను నిపుణులు డాక్టర్ ఎంఏ తాహీర్ అందజేశారు. షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈసందర్భంగా ఏవిఎస్ డాక్టర్ల బృందం డాక్టర్ తాహేర్ షుగర్‌వ్యాధి నిపుణులు, డాక్టర్ బి. సాధనరెడ్డి చర్మవ్యాధి నిపుణులు, డాక్టర్ జునేద్ హైమద్, డాక్టర్ ఏ అరవింద్‌లు మాట్లాడుతూ ఆరోగ్యంపట్ల ప్రతిఒక్కరూ వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలన్నారు. 35ఏళ్ళు దాటిన ప్రతిఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, సమయానికి మధుమేహం, రక్తపోటు పరీక్షలు పరీక్షించుకుంటూ ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చలికాలంలో చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశాలు మెండుగా ఉంటాయని, దురద వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా విధిగా డాక్టర్లను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కాగా ఏవిఎస్ క్లీనిక్ యజమాని వర్కాల శేఖర్ మాట్లాడుతూ షుగర్ వ్యాధి పరీక్ష శిబిరానికి ప్రజల నుండి మంచి స్పందన లభించిదని కొనియాడారు. ల్యాబ్ టెక్నిషియన్ నవీన్, శివ, క్లినిక్ సిబ్బంది నర్సు అలివేలు, రేవతి, శైలజ తదితరులు ఉన్నారు.

## మల్కిజ్ గూడలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం



విద్యార్థులకు పరిశుభ్రత పారిశుద్యంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**యాచారం డిసెంబరు18,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని మాల్కిజ్ గూడ గ్రామంలో క్రీడా కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం క్రీడా అధికారులు పరిశుభ్రత పారిశుద్యంపైన అవగాహన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వ్యవసాయ ప్రధాన కార్యదర్శి బోయిని నర్సిహులు మాట్లాడుతూ... పారిశుద్యం మానవ జీవన విధానంలో ఎంతో అవసరమని వాటి ప్రాముఖ్యతను వివరించారు. మల్కిజ్ గూడ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పారిశుద్యం పరిశుభ్రత పోషకాహారం వాటి వివరాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్,సరోజిని,అమర జ్యోతి,సర్పంచ్ చిర్ర యాదమ్మ,వార్డు సభ్యులు, గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 18, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్‌లోని నారపల్లి, పోచారం, ఇస్మాయిల్ ఖాన్‌గూడ, యంనంపేట్ తదితర గ్రామాల్లోని వార్డుల్లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్ ఆరోపించారు. పోచారం మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశం అనంతరం కాంగ్రెస్ కౌన్సిలర్ విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్‌లో నిత్యకృత్యమైన అక్రమ నిర్మాణాల విషయమై పలుమార్లు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదని అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఇన్ఫోసిస్ సమిపంలో రెండు వందల గజాల స్థలంలోనే ఆరు అంతస్తుల భవంతి నిర్మిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు నిబంధనలను అతిక్రమించి అక్రమార్జనకు పాల్పడుతున్నారని కౌన్సిలర్ ఆరోపించారు. ఆక్రమ నిర్మాణాలు చేపడుతున్న ఇకనైనా కమిషనర్ స్పందించి అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో కౌన్సిలర్‌తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



పోచారం మున్సిపల్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్.



మాట్లాడుతున్న టీపీ అంజిలయ్య

## ప్రతి వ్యక్తికి 100 రోజుల పని కల్పించడమే లక్ష్యం

**ఉపాధిహామీ టీపీ అంజిలయ్య**

**పెద్దేముల్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** సమాజంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అత్యంత వెనుకబడిన వారికి ఏడాదికి 100 రోజుల పని కల్పించడమే ఉపాధిహామి లక్ష్యమని టీపీ అంజిలయ్య అన్నారు. 2023-2024 సంవత్సరానికి గాను ఉపాధిహామి పనులను కల్పించేందుకు సోమవారం పెద్దేముల్ మండలంలోని మంబాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉపాదిహామీ మేటీలు, రైతులు, కూలీలతో నిర్వహించిన గ్రామ సభకు టీపీ అంజిలయ్య, పంచాయతీ కార్యదర్శి సంజీవ్ హజారై ఉపాధిహామి పథకం ద్వారా చేపట్టే చెరువుల పూడికతీత, పంట కాలువల పనులు, మట్టికట్టలు, పండ్ల తోటల పెంపకం తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి కోసం నమోదు చేసుకున్న ఏ వయోజనునికైన ప్రతి ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజులు ఉద్యోగ హమీ ఇవ్వడానికి ఈ పథకం రూపొందించబడిందని అన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టే పనులను ప్రతిఒక్కరు సద్వినీయోగం చేసుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ చెక్క ఆనందం, ఉపాధిహామి మేటీలు హకీం ప్యాట శ్రీనివాస్, ఆర్.వెంకటమ్మ, సుజ్ఞాని, ఎస్.వెంకటయ్య, గొబ్బురు వెంకటయ్య, రైతులు ఇబ్రాహీం,ఎంగూరు అశోక్, కోటపల్లి రాములు, హన్మగల్ల చంద్రప్ప, యూసని భీమయ్య, యాసని ఎల్లప్ప, తిమ్మగల్ల బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి ఎర్టిగా వాహనం బోల్తా

**ఇద్దరికి తీవ్రగాయాలు, నలుగురికి స్వల్పగాయాలు**



ప్రమాదానికి గురైన వాహనం

**పెద్దేముల్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** అదుపుతప్పి ఎర్టిగా వాహనం బోల్తాపడిన సంఘటన పెద్దేముల్ మండలంలోని ఖానాపూర్ గేటు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైద్రాబాద్ నుంచి తాం దూరు వస్తున్న ఎర్టిగా వాహనం ఖానాపూర్ గేటు సమీపంలో బొల్తాకొట్టింది, దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న నదీమ్, వసీం, షఫీ, హాఫీజ్, నసీర్, సోహెబ్, నవాజ్‌లకు గాయలయ్యాయి. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య చికిత్స కోసం హైద్రాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**తలకొండపల్లి డిసెంబరు18,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని మాధాయపల్లి గ్రామానికి చెందిన ఆయిల్ రాఘవేందర్ గౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 3వేల రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు.అదే విధంగా వెల్జాల్ గ్రామానికి చెందిన బోయ రాములమ్మ మృతి చెందాడంతో వారికి కూడా 3వేలను సాయంగా అందించారు.ఈ కార్యక్రమంలో బయ్య యాదయ్య,శ్రీను,సత్యం గౌడ్,శ్రీరామ్,శ్రీకాంత్,అవినాష్ గౌడ్,అభిలాష్ గౌడ్,యాదయ్య,గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్,వార్డు సభ్యుడు యాదయ్య,నర్సింహ,అభిలాష్ గౌడ్,అంజి,రవి,పరంధాములు,రవి పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో :** మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి చెందిన బోయ రామలమ్మ మృతి చెందాడంతో ఉప సర్పంచ్ అజీజ్ ద్వారా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూర్ ప్రభాకర్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను రూ. 3వేలు,ఎంపిటిసి అంబాజీ ఒక వెయ్యి,ఉప సర్పంచ్ 1500లను అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ నర్సింలు,నాయకులు లింగం యాదవ్,రాజు,రవి, తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**ధారూర్ డిసెంబరు18,ప్రభాతవార్త :** చేపల వేటకు చెరువుకు వెళ్లిన ఓ వ్యక్తి మూర్చ రావడంతో నీటిలో మునిగి మృతి చెందాడు.ఈ ఘటన మండల పరిధిలోని కుమ్మరిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...కుమార్‌పల్లి గ్రామానికి చెందిన గాజుల వెంకటయ్య (45) మూడు రోజుల క్రితం చేపల వేటగాని మండల పరిధిలోని నాగారం గ్రామ శివారులో ఉన్న చెరువుకు వెళ్లాడు.చేపల కోసం చెరువుల దిగి చేపల వల వేస్తుండగా మూర్చ రావడంతో అక్కడికక్కడే నీళ్లలో మునిగి చనిపోయాడు.మూడు రోజుల నుంచి ఇంటికి రాలేదని సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు మేరకు పోలీసులు గజ ఈతగాళ్లతో చెరువును వెతికించడంతో సోమవారం సాయంత్రం వెంకటయ్య మృతదేహం లభ్యమైయిం ది.కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలి

**కోట్‌పల్లి,డిసెంబరు 18, ప్రభాతవార్త;** తెలంగాణ గ్రామీణ బ్యాంకులో తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించి కొత్త రుణాలను పొందాలని బార్వాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరేందర్ అన్నారు. సోమవారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో వికాస్ భారత్ సంకల్పయాత్ర ద్వారా ప్రొజెక్టర్‌తో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ. బ్యాంకులో రుణాలు తీసుకున్న వారు దీర్ఘకాలికంగా పెండింగ్ ఉంచకుండా బ్యాంకుకు సహకరించాలన్నారు. రైతులు పెండింగ్ ఉంచకుండా రుణం కట్టి కొత్త రుణాలు తీసుకోవాలన్నారు. నూతనంగా పాసుబుక్కులు కలిగి ఉన్నవారికి కుడా కొత్త రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వీటితో పాటు ప్రతి ఒక్కరూ బీమా సౌకర్యం కల్పించుకోవాలన్నారు. పీఎం జేజేబీవై కింద రూ,436, రూపాయాలు, బీమా ద్వారా 18,వయస్సు నుండి 50,సంవత్సరాల వయస్సుల మధ్యలో ప్రమాధం జరిగితే రూ,2, లక్షలు వరకు సాధారణ బీమా వర్తిసుందని రూ,20 రూపాయాలు బీమా ద్వారా ప్రమాధవశత్తు పాముకాటు, కరెంటుషాక్,రోడ్డు ప్రమాధం పిడుగుపాటులకు వయస్సు 18 నుండి 70, సంవత్సరాల మధ్య వారికి రూ,2 లక్షల వరకు ఈ బీమా వర్తిస్తుందన్నారు. 60, సంవత్సరాలు నిండిన వారికి ఏపివై ద్వారా ఆటల్ పెన్షన్ సదుపాయం కుడా ఈ బ్యాంకు ద్వారా ఉందని వారు పేర్కొన్నారు. బ్యాంకు సిబ్బంది క్రిష్ణప్రసాద్, వెంకట్‌రెడ్డి, గ్రామ సర్పంచు పి, పాండురంగారెడ్డి, ఉప సర్పంచు సురేష్, సీఎస్పీ శ్రీకాంత్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు,

### వివిధ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి

శామిర్‌పేట డిసెంబరు18,ప్రభాతవార్త : ప్రముఖ చిన్న ఫైనాన్స్ బ్యాంక్,ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ జీవిత బీమా ఉత్పత్తుల పంపిణీ కోసం బ్యాంక్‌స్యూరెన్స్ భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి.ఈ భాగస్వామ్యం కింద ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బి 26 రాష్ట్రాల మరియు కేంద్ర పాలిత ప్రాంతాలలో 7వందల బ్రాంచ్‌ల విస్తృత నెట్‌వర్క్ ద్వారా ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ యొక్క కస్టమర్ ఫ్రెండ్లీ ప్రొటెక్షన్,దీర్ఘకాలిక పొదుపులు మరియు పదవి విరమణ పథకలా యొక్క మొత్తం సూట్‌ను తమ వినియోగదారులకు అందించనుంది.వివిధ జీవిత దశ అవసరాలకు అనుగుణంగా ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఉత్పత్తుల సూట్‌ను అభివృద్ధి చేసినట్లు వెల్లడించింది.



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేత తుమ్మల నరసింహులు యాదవ్

## కాంగ్రెస్ పార్టీ కన్న తల్లి లాంటిది

**-ప్రతి ఊరు,పల్లె తండా నా కుటుంబమే**

**-ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటా**

**-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**నందిగామ డిసెంబరు18,ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ కన్నతల్లీ లాంటిదని,ప్రతి ఊరు ,ప్రతి పల్లె ,ప్రతి తండా నా కుటుంబమేనని పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. సోమవారం నందిగామ మండలం అంతిరెడ్డి గూడ గ్రామంలో కాంగ్రెస్ యువ నాయకుడు తుమ్మల నరసింహులు యాదవ్ స్వగృహంలో ఏర్పాటే చేసిన పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలే నా బలం నా బలగం అని నన్ను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలందరికి రుణపడి ఉంటాను అన్నారు.షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి అందరూ సమిష్టి కృషితో సమన్వయంతో మెలిగి తోడ్పాటునందించాలని కోరారు.అనంతరం కాంగ్రెస్ నాయకుడు తుమ్మల నరసింహులు యాదవ్ జ్యోతి దంపతులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పూలమాల వేసి శాలువాతో సన్మానించారు.ఈ వేడుకల్లో మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్,కాంగ్రెస్ సీనియర్ నేతలు బాబర్ ఆలీఖాన్,పురుషోత్తం రెడ్డి,కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లే శంకరయ్య గౌడ్,కాంగ్రెస్ నాయకులు జిల్లెల బాల్ రెడ్డి, ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ,దేపల్లే కుమారస్వామి గౌడ్,పసుల బుచ్చయ్య, పాండు,కుందారం వెంకట రెడ్డి,బి.రామ్‌రెడ్డి, రామస్వామి, మల్లేష్ గౌడ్,రాజేందర్ ,కర్ణం రమేష్,తుమ్మల శ్రీను, డి.రాజు,వినయ్,శశాంక్,తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమనాయకుడు బాలాజీ సింగ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి

**మాడ్గుల,డిసెంబర్18,ప్రభాతవార్త:** తెలంగాణ మలిదశ ఉద్యమనాయకుడు, నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ బాలాజీ సింగ్ గారికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు,ఉద్యమనాయ కులు సామల నిరంజన్‌గౌడ్,సూదిని శ్రీనివాస్‌రెడ్డి,కొప్పుల జగన్‌గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో విదేశాల నుండి వచ్చి తెలంగాణ కోసం కల్వకుర్తి నియో జకవర్గంలో ఊరు ఊర తిరిగి తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసి అత్యంత ముఖ్య నేతలలో బాలాజీసింగ్ ఒక్కరన్నారు. ఇటివల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కల్వకుర్తి,అచ్చంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను కసిరెడ్డి నాయరణరెడ్డి,చిక్కుడు వంశీకృష్ణ గెలిపించడంలో కీలక భూమిక పోషించారు అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యమనేత బాలాజీ సింగ్‌ను గుర్తించి ఎమ్మెల్సీగా గుర్తించాలని కోరారు. మాజీ ఎంపీపీ జంగయ్య,మాజీ ఎంపీటీసీ సభ్యులు దేవయ్యగౌడ్, కృష్ణయ్యగౌడ్, చంద్రయ్యగౌడ్, మల్లేష్‌గౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం : సిఐ

**కడ్తాల్, డిసెంబరు 18 ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు పితామహులు ఎల్సిపిఎఫ్ కో ఆర్డినేటర్ జి. చిన్నాకిషన్‌రెడ్డి తండ్రి జి.వెంకట్ రాజిరెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారు కడ్తాల్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ గవర్నర్ జి. చిన్నాకిషన్‌రెడ్డితో కలిసి కడ్తాల్ సిఐ శివప్రసాద్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 450 మందికి అన్నదాన కార్యక్రమం చేసినట్లు క్లబ్ పిఆర్‌ఓ పాషా తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో లయన్స్ చేపట్టే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, ఎంపిపి కమ్లిమొత్యనాయక్, జిల్లా చైర్మన్ జూలూరు రమేష్, క్లబ్ సభ్యులు చేగూరి వెంకటేష్, బిచ్యనాయక్, ఎంపిటిసి సభ్యులు గూడూరు శ్రీనివాసరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యాట నరసింహ, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు పిప్పళ్ల వెంకటేష్, జహంగీర్, క్యామ మల్లేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పనులపై గ్రామసభ

**చౌడపూర్ డిసెంబరు18,ప్రభాతవార్త :** మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం అమలుపై సోషల్ ఆడిట్ నిర్వహించి ప్రజల నుంచి సోషల్ ఆడిట్ అధికారి డిఆర్‌పి నరసవ్య వివరాలు సేకరించారు.మందిపల్ గ్రామ సర్పంచ్ మఠం ప్రమీల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి జాతీయ ఉపాధీ హమి పథకం అమలుపై గ్రామస్థులతో చర్చించడం జరిగింది. గ్రామపంచాయతీ కార్యదర్శి స్వరూప,మహిళలు పాల్గొన్నారు

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**చేవెళ్ల, డిసెంబర్ 18 ప్రభాతవార్త :** గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన చేవెళ్ల మండల కేంద్రంలోని రైతుబజార్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చేవెళ్ల మండల కేంద్రంలోని పోలీస్ క్వార్టర్స్ సమీపంలోని రైతు బజార్ దగ్గర గుర్తుతెలియని వ్యక్తి శవం కనిపించింది. అతని వయస్సు సుమారుగా 40 నుండి 45 సంవత్సరాలు ఉంటుందన్నారు. అతని గురించి చుట్టుప్రక్కల విచారించగా ఎవరూ గుర్తించలేరన్నారు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే సమాచారం ఇవ్వగలరని పోలీసులు తెలిపారు.

### మేడ్చల్ ప్రజా దర్బార్‌కు ఆరు ఆర్జీలు

**మేడ్చల్, డిసెంబర్ 18. ప్రభాతవార్త :** మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వయించారు. ఉదయం 10.30 కు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఆరు మంది ఆర్జీ పెట్టుకున్నారు. ధరఖాస్తులు స్వీకరించిన అధికారులు సంబంధిత శాఖల అధికారులకు వాటిని పంపించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రజితా రాజమల్లారెడ్డి, ఎంపిడిఓ పద్మావతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సీఎంఆర్‌లో హరితహారం

**మేడ్చల్, డిసెంబర్ 18. ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయలో గల సీఎంఆర్ సెట్ క్యాంపస్‌లో ఎన్ఎస్ ఎస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం హరితహారం కార్యక్రమాన్ని నిర్వయించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి ఎ. నారాయణ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు నాగరాజు నాయక్, రోహిణిరెడ్డి, విజయ్ శాంతి, డీన్ కెవిఎల్ సౌజన్య, సోషల్ వెల్ఫేర్ బోర్డ్ స్టూడెంట్ ప్రిసిడెంట్ రితికారెడ్డి, పాల్గొన్నారు.

### విద్యార్థుల పురోగతిని ప్రోత్సహించడమే లక్ష్యం

శామిర్‌పేట డిసెంబరు18,ప్రభాతవార్త :యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్ సిఎస్ఆర్ స్పాన్సర్‌షిప్ ప్రోగ్రామ్ నుండి ప్రయోజనం పొందేందుకు సిద్ధమైన ఆంధ్రప్రదేశ్‌లోని 50వేల విద్యార్థులు సామాజిక చలనశీలత మరియు కేరీర్ పురోగతిని ప్రోత్సహించడానికి పాఠశాలల ఎంగేజ్‌మెంట్ ప్రోగ్రామ్ నుండి ప్రయోజనం పొందేందుకు సిద్ధంగా ఉన్నారు.మెల్బోర్న్ విశ్వవిద్యాలయం పరివర్తనాత్మక చొరవను విస్తరించడానికి ఆంధ్రప్రదేశ్‌లోని కమ్యూనిటీ మరియు ప్రభుత్వ పాఠ్యాంశాల్లో కలిసిపోతుంది.సానుకూల మనస్తత్వం శాస్త్రం మరియు కోచింగ్‌తో కూడిన మాడ్యూల్‌లు తమను తాము అర్థం చేసుకోవడంలో సహాయపడతాయి.



రాజుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## బిఆర్ఎస్ ఎంపిటిసి కాంగ్రెస్‌లో చేరిక

**నారాయణఖేడ్, డిసెంబర్ 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అనంతసాగర్ ఎంపీటీసీ బ్యాగరి రాజు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం ఎమ్మెల్యే డాక్టరు పట్లోళ్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఎంపీటీసీ రాజుకు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎంపీపీ తనయులు రమేష్‌చౌహాన్, పంచగామ ఎంపీటీసీ విఠల్ ఉన్నారు.

## సాదాసీదాగా మండల సమావేశం



మండల సభకు హాజరైన మండల సభ్యులు, అధికారులు

**న్యాల్‌కల్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** ఎంపిపి అధ్యక్షురాలు అంజమ్మ అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఆయా శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి నివేదికలను చదివి వినిపించారు. విద్యుత్ అధికారుల తీరుపై కొందరు సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఎంపిఓ సురేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఈకెవైసి కోసం గుమిగూడిన జనం



జహీరాబాద్ గ్యాస్ ఏజన్సీ వద్ద గుమిగూడిన జనం

**జహీరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** గ్యాస్ కనెక్షన్ ఉన్న లబ్ధిదారులు కనెక్షన్‌ను అప్‌డేట్ చేసుకోవాలని గ్యాస్ ఏజన్సీ డీలర్లు ఆదేశించడంతో వినియోగదారులు ఏజన్సీ దుకాణాల ముందు జనం గుమిగూడుతున్నారు. ఐదారు రోజులుగా పట్టణంలోని ప్రతి గ్యాస్ ఏజన్సీ (భారత్ గ్యాస్, ఇండియన్ గ్యాస్, హెచ్పి తదితర ఏజన్సీ ముందు వినియోగదారులు బారులుతీరి తమ ఏజన్సీని అప్‌డేట్ చేసుకుంటున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్యాస్ సిలెండర్ కనెక్షన్ రూ. 500 అందిస్తామని ప్రకటించడంతో వినియోగదారులు తమ గ్యాస్ కనెక్షన్‌కు ఈకేవైసి చేయించుకునేందుకు గ్యాస్ కనెక్షన్ కార్యాలయంకు అందరు చేరుకుంటుండంతో కార్యాలయాల వద్ద జనం రద్దీ పెరిగిపోతోంది. జనాలు అధికం కావడంతో ఓతోపులాటలు జరుగుతున్నాయి. ఈకేవైసి విషయంలో గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ ఏజన్సీ డీలర్లు సరైన సమాచారం అందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

## సాదాసీదాగా సర్వసభ్య సమావేశం




మాట్లాడుతున్న ఎంపిపి బాలయ్య

**జోగిపేట, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** మండల సర్వసభ్య సమావేశంపై అటు అధికారులుగానీ, ఇటు ప్రజాప్రతినిధులుగానీ ఆసక్తి చూపకపోవటంతో మరీ చప్పగా సాగింది. హాజరైనవారితో సమావేశం కానిచ్చారు. సర్పంచుల కాలపరిమితి మరో నెలతో ముగుస్తున్న సందర్భంలో ఈ సమావేశం వారికి చివరిది కానుండగా, ఎవరూ పెద్దగా హాజరు కాలేదు. అదే స్థాయిలో వివిధ శాఖలకు చెందిన అధికారులూ హాజరుకాలేదు. దీంతో నామమాత్రంగా ఈ సర్వసభ్య సమావేశం కొనసాగింది. సమస్యలు లేవనెత్తటం, వాటికి అధికారులు సమాధానాలు చెప్పటం లాంటివి ఏమీ లేకుండా ఎజెండా ప్రకారం అధికారులు నివేదికలు చదివి వినిపించారు. మండల పరిషత్ అధ్యక్షులు బాలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తాలెల్మ ఎంపిటిసి సుజాత మాట్లాడుతూ గొర్రెల పంపిణీకి డబ్బులు కట్టామని, ఎప్పుడు వాటిని పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. సమావేశంలో ఎంపిడివో సత్యనారాయణతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## పందిల్లలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



పందిల్లలో వికసిత్‌భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం దృశ్యం

**హుస్నాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో సోమవారం మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు లకావత్ మానససుభాష్, వైద్యాధికారిణి డాక్టర్ నిఖిత, గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్ ఆధ్వర్యంలో వికసిత్‌భారత్ కార్యక్రమం సందర్భంగా గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి రోగులకు వైద్యపరీక్షలను నిర్వహించారు. ఇందులో ప్రధానంగా అధిక రక్తపోటు, మధుమేహం రోగులకు పరీక్షలు చేసి వారికి మందుబిళ్ళలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి బాణాల జయలక్ష్మి, హెల్త్‌సూపర్‌వైజర్ ఉల్లంగుల కనకయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి సుష్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నీచ రాజకీయాలకు తెరలేపుతున్న బిఆర్ఎస్ నాయకులు

**బెజ్జంకి, డిసెంబర్ 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి పదిరోజులు కాకముందే బిఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటని ఆ పార్టీ నియోజకవర్గ యువజన విభాగం ఉపాధ్యక్షులు శానగొండ శ్రావణ్ మండిపడ్డారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని ప్రశ్నించే అర్హత బిఆర్ఎస్‌కు లేదన్నారు. పదేళ్ల రాష్ట్రాన్ని పరిపాలించిన బిఆర్ఎస్ అప్పుల కుప్పగా చేసిందన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసపూరిత పాలన చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేసి తీరుతుందన్నారు. ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేసిందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందన్నారు.

# వంద ఫీట్ల వెడల్పులోనే రోడ్డు నిర్మాణం చేయాలి



రోడ్డుపై బైటాయించి ఆందోళన చేస్తున్న బాధితులు

**సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 18, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామం మీదుగా నిర్మాణం చేస్తున్న ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులు పాత మార్క్ ప్రకారం వంద ఫీట్ల వెడల్పులోనే చేయాలని గ్రామానికి చెందిన బాధితులు సోమవారం మిట్టపల్లి రైతువేదిక వద్ద రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ సంతోష్, నాయకులు కనక మల్లయ్య మాట్లాడుతూ గతంలో రోడ్డు వెడల్పు వంద ఫీట్లు ఉంటుందని మార్కింగ్ చేసిన అధికారులు తీర 150 ఫీట్ల వెడల్పు ఉటుంది మార్కింగ్ చేంజ్ చేస్తున్నారని వాపోయారు. అప్పట్లో అధికారులు ఇచ్చిన వంద ఫీట్ల వెడల్పు మార్కింగ్ ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణం చేపట్టామని సుమారు 35 నుంచి 40 ఇళ్లు అక్కడ నిర్మాణం చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతానికి 150 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపడితే నిర్మించుకున్న ఇండ్లతో పాటు ఖాళీగా ఉన్న ప్లాట్స్ కూడా పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. పాత మార్కింగ్ ప్రకారం వంద ఫీట్లకే రోడ్డు నిర్మాణం చేపట్టాలని బ్రిడ్జి నిర్మాణాన్ని సైతం 600 మీటర్లుకాకుండా 300 మీటర్ల వరకు కుదించాలన్నారు. గతంలో రైల్వే లైన్ నిర్మాణం కోసం భూములు పోగొట్టుకొని అందులో వచ్చిన డబ్బులతో ఇక్కడ ప్లాట్స్ కొనుక్కొని ఇంటి నిర్మాణం చేపట్టుకుంటే ఇప్పుడు అవీ మళ్లీ పోవడం వల్ల బాధితులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు స్పందించి ప్రజలకు న్యాయం జరిగేలా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.



మాట్లాడుతున్న జిల్లా ట్రెజరీ అధికారి బాల్‌రాజు

## ఘనంగా అఖిల భారత పింఛనుదారుల దినోత్సవం

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 18, ప్రభాతవార్త :** పెన్షనర్లకు తమ శాఖ పక్షాన ఎలాంటి ఇబ్బందులు రాకుండా అండగా ఉంటామని జిల్లా ట్రెజరీ అధికారి ఎస్.బాల్‌రాజు అన్నారు. సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సిద్దిపేట, చిన్నకోడూరు, నంగునూర్, కొండపాక మండల యూనిట్ల సంయుక్త అధ్వర్యంలో అఖిల భారత పింఛనుదారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పెన్షన్ల సాధనకు కృషిచేసిన డిఎస్ నకారా చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో జీవన ప్రమాణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అమ్మన చంద్రారెడ్డి తదితరులు మాట్లాడారు. 12 మంది సీనియర్ పెన్షనర్లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మంజిత్‌కౌర్, అర్.రాజిరెడ్డి, జి.మహంకాళి, రాములు, భూంరెడ్డి, గాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రాములు, రాజిరెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## వధువుకు పుస్తెలు, మెట్టెలు అందజేత

**రామాయంపేట, డిసెంబర్ 18, ప్రభాతవార్త :** మెదక్ జిల్లా నార్సింగి మండల సంకాపూర్ గ్రామానికి చెందిన ముత్యం నర్సవ్వ, రాములు ప్రథమ పుత్రిక నిరుపేద వధువు శోభ వివాహానికి రామాయంపేట పట్టణానికి చెందిన సంఘ సేవకుడు ఎర్రం అంజనేయులు 115వ పుస్తె మట్టెలు పెద్దమ్మ దేవాలయంలో అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవని ఆశీస్సులు ఉంటే ఇక రాబోయే రోజుల్లో ఇంకా అనేక సేవా కార్యక్రమాలు పుస్తె మట్టెలను తాను అందజేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రొయ్యల పోచయ్య, రొయ్యల కిషన్, ముత్యాల నరసవ్వ రాములు తదితరులు పాల్గొన్నారు.

## యువత వ్యాపార రంగంలో రాణించాలి : ఎమ్మెల్సీ

**గజ్వేల్ టౌన్, డిసెంబర్ 18 (ప్రభాతవార్త):** యువత వ్యాపార రంగంలో రాణించి ఆర్థికంగా బలోపేతం కావాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన సవేరా రెస్టారెంట్‌ను ఎమ్మెల్సీ యాదవరెడ్డి మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ వ్యాపారాలకు అనుకూల ప్రాంతంగా మారిందని, వినియోగదారుల మన్నన పొందే విధంగా వ్యాపారం కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, బిఆర్ఎస్ నాయకులు లతీఫ్‌ఖాన్, రషీద్‌ఖాన్, మొయినొద్దీన్, జాఫర్‌ఖాన్ పాల్గొన్నారు.

## కరాటే పోటీలలో కస్తూర్బా పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబర్ 18, ప్రభాతవార్త :** కరాటే పోటీలలో రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని కోమట్‌పల్లి కస్తూర్బా పాఠశాల విద్యార్థులు పతకాల ప్రభంజనం సృష్టించారని, పాల్గొన్న ప్రతి విద్యార్థి విజయం సాధించి 100 శాతం పతకాలు సాధించడం గొప్ప విషయమని కరాటే మాస్టర్ రొయ్యల హరిప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 17న రెంజ్యాంకి ఫోటోకాన్ కరాటే అకాడమీ ఆర్ఎస్‌పి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన నేషనల్ లెవల్ ఇంటర్ డోజో కరాటే పోటీల్లో కస్తూర్బా పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారని తెలిపారు. పాఠశాల నుండి 23 మంది విద్యార్థులు పాల్గొనగా ఒక్కరూ ఓటమి అనేది లేకుండా 800 మంది విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో 100 శాతం పతకాలతో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇందులో వయస్సు బరువు, వారి వారి విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చి మొదటి స్థానం 12, ద్వితీయ స్థానం 7, తృతీయ స్థానం 4గురు పతకాలు సాధించినట్లు వివరించారు. ఈ ప్రతిభను పాఠశాల స్పెషల్ ఆఫీసర్ అనురాధ, మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటు రామాయంపేట ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు మాస్టర్ హరిప్రసాద్‌ను, విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులు గెలుచుకున్న పతకాలతో మాస్టర్ హరిప్రసాద్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ అనురాధ, తదితరులు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## దళితవాడలో రేషన్‌షాప్ ఏర్పాటు చేయాలి

**రామాయంపేట, డిసెంబర్ 18, ప్రభాతవార్త :** రామాయంపేట ఎస్‌సి కాలనీలో రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, స్పోక్స్‌పర్సన్ పల్లె రాంచెందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి సూచన మేరకు రామాయంపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందించడం జరిగింది. రామాయంపేట ఎస్‌సి కాలనీలో పౌర సరఫరాల శాఖ ఏర్పడిన నాటి నుండి స్థానిక వార్డు ప్రజలు రేషన్ దుకాణం అందుబాటులో లేక సుమారుగా మైలు దూరం నుండి తెచ్చుకొని స్థానిక వార్డు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వార్డు ప్రజల ఇబ్బందులు గమనించి వార్డు పరిధిలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయ్యాలని ఎంఆర్‌వో మేడం గారికి విన్నవించుకోవడం జరిగింది. ఎస్సీ వార్డులో రేషన్ దుకాణం ఏర్పాటు చేయ్యాలని మద్దతు తెలిపిన దాకి స్వామి, కంభంపాటి విప్లవ్, సుంకోజు దామోదర్, ఎనిశెట్టి అశోక్, దండు శివశంకర్, అల్లాడి వెంకటేశ్, చింతల స్వామి, రెడ్డమైన నరేష్, చింతల నరేష్, సయ్యద్ అన్వర్ అలీ, సాకేత్‌రెడ్డి, సిహెచ్ నరేష్‌లకు కృతజ్ఞతలు తెలిపిన వార్డు కార్యకర్తలు, ప్రజలు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు బైరం కుమార్, సుంకోజు దామోదర్, బైరం శంకర్, అసాది రాజు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఇవో

'వార్త' ప్రభావం



పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో బుచ్చయ్య నాయక్

**చిన్నశంకరంపేట, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** మండల పరిధి గజగట్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగు నెలలుగా ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి పాఠశాలకు రాకుండా జీతం తీసుకుంటున్న విషయం ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టిన ప్రభోదుడు శీర్షికన 'వార్త'లో ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి బుచ్చయ్య నాయక్ సోమవారం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## సర్వసభ్య సమావేశం వాయిదా

**చిన్నశంకరంపేట, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** సోమవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ తెలిపారు. ఎంపీటీసీ కోరం లేకపోవడంతో సమావేశం వాయిదాపడిందని, తిరిగి ఎప్పుడు నిర్వహిస్తామో తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

## ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

**చిన్నశంకరంపేట, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** మండల పరిధి గజగట్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించకుండా ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి జీతం తీసుకుంటున్నాడని, అందుకు సహకరించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రణిద్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి పోచయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా విధ్యాధికారి రాధాక్రిష్ణకు వినపతి పత్రం అందించారు.



జిల్లా విద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

# విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదు

**నారాయణఖేడ్, డిసెంబర్ 18 ప్రభాతవార్త:** విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షురాలు చాందీబాయి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామల్లోని ప్రజలకు ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు అనేకంగా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామాల్లోని సమస్యలు ఉంటే ఆయా శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. మండలంలోని ఆయా పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. అంగన్‌వాడి కేంద్రాల్లోని విద్యార్థులకు చక్కని విద్యను అందించాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. అధికారులు నాయకులు సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు.

### మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గంలో విద్య, వైద్యం, అన్ని రంగాల్లో ముందుండాలని అధికారులకు సూచించారు. గ్రామల్లో ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తేస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులకు సూచించారు. సభలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమస్యలు సభదృష్టికి తేవడంతో ప్రభుత్వం చొరవతో అన్ని సమస్యలను పరిష్కస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందనాయక్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ విద్యచరణ్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



పార్టీ బీమా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

## బాధిత కుటుంబానికి పార్టీ బీమా చెక్కు అందజేత

**మిరుదొడ్డి, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** కార్యకర్తలకు అండగా బిఆర్ఎస్ పార్టీ నిలుస్తుందని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బేగంపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త కాపర్ల నర్సింలు ఇటీవల మృతి చెందగా పార్టీ సభ్యత బీమా ద్వారా వచ్చే రూ.2 లక్షల చెక్కును సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ కార్యకర్తల సంక్షేమానికి పార్టీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పోతారం ప్రతాప్, కాలేరు శ్రీనివాస్, తుమ్మల బాలరాజు, బిఆర్ఎస్ నాయకులు బోరం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

**న్యాల్‌కల్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఓటరు లిస్టులో చేర్పులు, మార్పులు నమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో ఓటరు లిస్టులో తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ బాధ్యులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. ఓటుహక్కు ఉన్న వారు ఓటరుకార్డులో మార్పులు, చేర్పులు అవసరమైతే సరిచేసుకునేలా చూడాలని సూచించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడివో వెంకట్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్స్ అనితరెడ్డి, ఆర్ఐ దుర్గయ్య, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడి బాధ్యులు, అధికారులు నాగభూషణం, నర్సింలు, దుర్గయ్య, శ్రీనివాస్, సాయన్న, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన డిసిసి ప్రధాన కార్యదర్శి

**నారాయణఖేడ్, డిసెంబర్ 18 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగల్‌గిద్దా మండల పరిధిలోని షాపూర్ గ్రామానికి చెందిన యువనేత మహాలింగ్ పటేల్ వివాహం జరిగింది. సోమవారం డీసీసీ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌స్వామి, గుండేరావు, అనిల్ పాటిల్, సర్పంచ్ సచిన్ పాటిల్, యూత్‌నేత అంజిరెడ్డి, పీఎసీఎస్‌వైస్ చైర్మన్ నాగిశెట్టి పాల్గొన్నారు.

## పాఠశాల నిర్మాణానికి భూరీ విరాళం



దాతను సత్కరిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త :** పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల నిర్మాణానికి సోమవారం ముత్తినేని రఘునందన్‌రెడ్డి పాఠశాల నిర్మాణ కమిటి సభ్యులకు రూ 1లక్ష 50వేల భూరీ విరాళాన్ని అందజేశారు. విరాళం అందించిన రఘునందన్‌రెడ్డిని పాఠశాల నిర్మాణ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. సత్కరించిన వారిలో పాఠశాల నిర్మాణ కమిటి అధ్యక్షులు కొత్తపల్లి అశోక్, తాటిపల్లి వెంకటేశం, చిట్టి గోపాల్‌రెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి, లక్ష్మీపతి, శ్రీనివాస్ మున్సిపల్ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, మాడిశెట్టి హేమలత, గోపగోని రమాదేవి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత

**కొమురవెల్లి, డిసెంబర్ 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గురువన్నపేట గ్రామంలో ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు సోమవారం బిఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేశారు. బాధిత కుటుంబాలకు తన వంతు సహాయం అందించడం జరిగిందని బిఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, గ్రామ ప్రజలు బిఅర్‌అర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ... ఆర్థిక సహాయం

మండల కేంద్రానికి చెందిన జంపాల సుజాత అనారోగ్యతో మృతి చెందగా సోమవారం సర్పంచ్ సార్ల లతాకిష్టయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే గొల్లపల్లి ఆంజనేయులు బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ముత్యం పరశురాములు, ముత్యం విజయ్, సార్ల సురేష్, ముత్యం విజయ్‌కుమార్, గజ్జె అశోక్ ఉన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

## అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

**సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని తడకపల్లిలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన దండు శ్రీనివాస్(35) స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి పేకాట అడుతున్న సమయంలో వారి మధ్య గొడవ జరిగిందనీ, దీనిని ఇతరులు సద్దుమణిగేలా చేశారని పోలీసులు తెలిపారు. గొడవ అనంతరం అక్కడి నుంచి అందరూ వెళ్లిపోగా అక్కడ పడిపోయిన శ్రీనివాస్‌ను అదే గ్రామానికి చెందిన వ్యక్తి అటోలో ఎక్కించుకొని ఇంటికి తీసుకెళ్లి స్పృహ కోల్పోయిన విషయాన్ని కటుంబ సభ్యులకు వివరించినట్లు తెలిపారు. వెంటనే అదే ఆటోలో శ్రీనివాస్‌ను సిద్దిపేట ప్రభుత్వ అసుపత్రికి తరలించినట్లు వివరించారు. అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని తెలిపారు. పేకాట అడుతున్న సమయంలో జరిగిన ఘర్షణతో మృతి చెందాడని, వెంటనే పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలని మృతుడి భార్య దండు రాధ ఫిర్యాదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు వివరించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**చౌటకూరు, డిసెంబరు 18, ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి గాయాలకు గురైన సంఘటన మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మణికంఠ సోమవారం ఉదయం కొర్పల్ గ్రామం నుంచి సంగారెడ్డి పట్టణానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడన్నారు. సుల్తాన్‌పూర్ గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో మణికంఠకు తీవ్రంగా గాయాలు కాగా స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం సంఘటన స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గాయపడ్డ వ్యక్తి

## డిప్యూటీ సిఎం, మంత్రి సురేఖకు సత్కారం



భట్టి విక్రమార్కను సత్కరిస్తున్న టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు యాదగిరి

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 18, ప్రభాతవార్త :** రాష్ట్ర డిప్యూటీ సిఎం, అర్థికశాఖ మంత్రి భట్ట విక్రమార్కను టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బొమ్మల యాదగిరి సోమవారం హైదారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే రాష్ట్ర అటవీ పర్యావరణ,దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను హైదారాబాద్‌లో మరా ్యదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

## ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన రమేష్ యాదవ్



వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాను కలుసుకున్న రమేష్ యాదవ్

**మునిపల్లి, డిసెంబరు 18, ప్రభాతవార్త:** మండలంలోని లింగంపల్లి గ్రామానికి సోమవారం చేరుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు దామోదర రాజనర్సింహాను తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటి సభ్యులు రమేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఎమ్మెల్యేగా విజయం సాధించి రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రి పదవిని అందుకోవడం ఆనందంగా ఉందని రమేష్ యాదవ్ మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

## విశ్వజన కళామండలి జాతీయ కమిటీ జాయింట్ సెక్రటరీగా బాలనర్సయ్య



నియామకపత్రం అందుకుంటున్న బాలనర్సయ్య

**గజ్వేల్ టౌన్, డిసెంబర్ 18 (ప్రభాతవార్త):** విశ్వజన కళామండలి జాతీయ కమిటీ జాయింట్ సెక్రటరీగా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన మాచపురం బాలనర్సయ్యను నియమిస్తూ టివైఆర్ ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజు, రాష్ట్ర నూతన అధ్యక్షుడు అందె భాస్కర్‌లు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలనర్సయ్య మాట్లాడుతూ సామాజిక, రాజకీయ, సాంస్కృతిక భౌతిక అంశాలపై విశ్వజన కళామండలి పనిచేస్తుందని, దీనిపై ప్రజలలో అవగాహన కల్పిస్తూ కళారూపకంగానే కాకుండా ఆర్థికంగా సామాజిక అంశాలపై కవులు, కళాకారులు రాజ్యాధికారం అందుకునే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో జాతీయ కమిటీ జాయింట్ సెక్రటరీగా నియమించినందుకు తలకొక్కుల రాజు, అందె భాస్కర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ



తాట్‌పల్లి పాఠశాలను తనికీ చేస్తున్న డీఈఓ

**మునిపల్లి, డిసెంబరు 18, ప్రభాతవార్త:** మండలంలోని తాట్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టుకున్నారు. విద్యార్థుల నుంచి సరైన సమాదానాలు రాకపోవడంతో డీఈఓ అసంతృప్తికి గురయ్యారు. విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ద వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. 10వ తరగతి విద్యార్థుల కొరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి దశరత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## కక్కరవాడలో విగ్రహాల ప్రతిష్టాపన



కక్కరవాడలో విగ్రహాల ప్రతిష్టాపన చేస్తున్న దృశ్యం

**ఝరాసంగం, డిసెంబరు 18, ప్రభాతవార్త:** మండలంలోని కక్కరవాడ గ్రామంలో సోమవారం శివలింగం, నందీశ్వర విగ్రహాల ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణులు వేద మంత్రాలు వల్లిస్తుండగా భక్తుల సమక్షంలో విగ్రహాల ప్రతిష్టాపన వైభవంగా కొనసాగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బోజిరెడ్డి, తమ్మలి వీరన్న, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

## చెక్‌డ్యాంలో మునిగి వ్యక్తి మృతి

**పాపన్నపేట, డిసెంబరు 18, ప్రభాతవార్త:** ప్రమాదావశాస్తు చెక్‌డ్యాంలో నీటిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఏడుపాయల్లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం... కర్నాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన బస్వరాజ్ (50) ఏడుపాయల వనదుర్గా భవాని మాతను దర్శించుకునేందుకు సోమవారం కుటుంబ సభ్యులతో ఆలయానికి చేరుకున్నారన్నారు. మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వెళ్లి ప్రమాదావశాస్తు చెడ్ డ్యాంలో మునిగి మృతి చెందాడన్నారు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

# సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

**పెద్దశంకరంపేట, డిసెంబర్18 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పెద్దశంకరంపేటకు మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలను బదిలీ చేయాలని, దాదాపు 500 మంది నిరుపేదలకు ఇండ్ల స్థలాలకు సంబంధించి పట్టాలు ఇవ్వడంతో పాటు గృహాలు మంజూరు చేయాలని, మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డికి పెద్దశంకరంపేట సర్పంచి సత్యనారాయణ సోమవారం వినతిపత్రం సమర్పించారు. మండలానికి మంజూరైన మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాల పెద్దశంకరంపేటలో స్థలం లేకపోవడం వలన ప్రస్తుతం నారాయణఖేడ్‌లో కొనసాగుతుందన్నారు. ఈ పాఠశాలను పెద్దశంకరంపేటకు బదిలీ చేయాలని, అదేవిధంగా నిరుపేదలైన దాదాపు 500 కుటుంబాలకు ఇండ్ల స్థలాలు మంజూరు చేసి గృహాలు నిర్మించేందుకు సహకరించాలని పేర్కొన్నారు. పెద్దశంకరంపేటలో మైనారిటీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల మంజూరు చేయవలసిందిగా నారాయణఖేడ్ ఎమ్మెల్యేకు సర్పంచి విన్నవించారు. పెద్దశంకరంపేట పట్టణ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డిని ఈ సందర్భంగా కోరారు.



ఎమ్మెల్యే సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి సత్యనారాయణ

# సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారుల పై వేటు తప్పదు

**-అధికారుల ప్రజాప్రతినిధుల సమన్వయంతో అభివృద్ధికి సహకరించండి**
**-ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం**
**-అనుమతి లేకుండా సమావేశంలో బిఆర్ఎస్ అధ్యక్షుడి రాక పై బిజెపి వాగ్వాదం**



సర్వసభ్య సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడి అనుమతి పై అధికారులను ప్రశ్నిస్తున్న వెల్మే కన్నె సర్పంచ్ రాజెందర్

**కౌడిపల్లి, డిసెంబర్ 18.ప్రభాతవార్త:** మండల అభివృద్ధి పై మూడు నెలలకొకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల అధికారులు గైర్హాజరైతే వేటు తప్పదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హెచ్చరించారు.సోమవారం నాడు మండల అభివృద్ధి సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజయ్యారు.ఎంపిపి రాజునాయక్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం కొనసాగుతుండగా వేదిక పై బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడికి అనుమతి ఉంటుందాఅని బిజెపి మండల శాఖ అధ్యక్షులు రాకేశ్, బిజెపి సర్పంచ్ రాజెందర్ లు బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులతో వాగ్వివాదం చేశారు.బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడే కాకుండా మండల రైతు కమిటీ చైర్మన్ హోదా పై అనుమతిచ్చినట్లు బిఆర్ఎస్ నాయకులు దాటవేశారు.బిఆర్ఎస్ నాయకుల అండదండలతో అధికారులు ఈ విదంగా వ్యవహరించడం సబబు కాదని బిజెపి నాయకులు అవేదన వ్యక్తం చేశారు.ఎంపిడివో కలుగజేసుకొని బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షున్ని సమావేశం నుండి బయటకు పంపించి సమావేశాన్ని సజావుగా నిర్వహించేలా చేశారు.వెల్మేకన్నె గ్రామ శివారులో సర్వే నెంబర్ 444,447 ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతుందని గతంలో నిర్వహించిన సమావేశాల్లో పిర్యాధు చేసిన చర్యలు లేవని వెల్మేకన్నె సర్పంచ్ రాజెందర్ ఆరోపించారు.ఇప్పటికైనా మండలంలోని అన్యాక్రాంత మవుతున్న ప్రభుత్వ భూములను ఎమ్మెల్యే, మండల అధికారులు కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యేగా నూతనంగా గెలుపొందిన సునీతారెడ్డిని ఆయా శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు గజమాలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ విలువలను కాపాడుతూ విధిగా సమావేశాలకు ప్రజా ప్రతినిధులు,అధికారులు హాజరై వారి సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆమె కోరారు.సర్వసభ్య సమావేశం సాదా సీదాగా కొనసాగింది. ఈకార్యక్రమంలో వీరితో పాటు జడ్పిటీసీ కవిత అమర్‌సింగ్, ఎంపిడిఓ శ్రీనివాసులు,తహాశీల్దార్ ఆంజనేయులు,ఎంపిటిసీల ఫోరం అధ్యక్షులు గుంజరి ప్రవీణ్‌కుమార్,ఎంపిటిసీ లు ఆయా గ్రామలకు చెందిన సర్పంచ్ లు వివిద శాఖలకు చెందిన అధికారులు తదితరుల పాల్గొన్నారు.

# వేతనం కోసం హైకోర్టుకు....

**అల్లాదుర్గం, డిసెంబరు 18, ప్రభాతవార్త:** జిల్లా గ్రంథాలయ సంస్థలో భాగమైన బిడిసి పుస్తక నిక్షిప్త కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న నిర్వాహకులు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజా వాణిలో ధరఖాస్తు చేసుకున్నాడు. మండలంఓని ముప్పారం గ్రామానికి చెందిన చాకలి నారాయణ పుస్తక నిక్షిప్త కేంద్రంలో గత 18 సంవత్సరాలుగావిధులు నిర్వహిస్తూ వస్తున్నారు. 3వందల రూపాయల వేతనంలో ప్రారంభమైన ఉద్యోగం ప్రస్తుతం 1వేయి రూపాయలు మాత్రమ వేతనాన్ని అందుకుంటున్నాడు. వేయి రూపాలయ వేతనంలో కుటుంబ పోషణ భారంగా మారిందని నారాయణ విచారం వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని నారాయణ హైకోర్టును ఆశ్రయించడంతో జిల్లా గ్రంథాల కార్యదర్శి నారాయణ వేతానన్ని గత 50 మాసాలుగా నిలిపి వేశాడు. హై కోర్టును ఆశ్రయించినందుకే వేతనం ఆపామని అధికారులు పేర్కొంటున్నారని విచారం వ్యక్తం చేశారు. వేతనం ఆపడంపై విచారణ జరపాలని తనకు రావాల్సిన వేతనాన్ని ఇప్పించాలని, తనకు న్యాయం చేయాలని ప్రజా వాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులో పేర్కొన్నట్లు నారాయణ వివరించారు.



వేతనం పెంచాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నిర్వాహకుడు

# కాళ్లకల్‌లో ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



అయ్యప్ప స్వామి మహా పడిపూజలో పాల్గొన్న ఈటెల రాజేందర్

**మనోహరాబాద్, డిసెంబర్18 ప్రభాతవార్త:** మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజను గురుస్వామి జగ్గ ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు కాళ్లకల్ సర్పంచి నత్తి మల్లేష్ ముదిరాజ్ సోమవారం అయప్ప మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అయ్యప్ప స్వామిని పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ మంత్రి ఈటెల రాజేందర్, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణలు హాజరై అయ్యప్ప పూజలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజకు విచ్చేసిన అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు వీరబోయిన గోపాల్, పురం గిరిధర్, కనిగెరి రవికుమార్, తుమ్మల రాజుయాదవ్, కుమ్మరి కృష్ణ, పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నంను సత్కరించిన సామాజిక సేవకురాలు



మంత్రిని శాలువాతో సత్కరిస్తున్న మంజులరెడ్డి

**హుస్నాబాద్,డిసెంబరు18,ప్రభాతవార్త** హుస్నాబాద్ శాసనసభ్యులు పొన్నం ప్రభాకర్‌గౌడ్ సోమవారం రోజున హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రిగా బాద్యతలు సీకరించారు.మంత్రిగా బాద్యతలు స్వీకరించిన పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కాంగ్రెస్ నాయకురాలు,సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజూలరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుబాకాంక్షలు తెలిపారు.

## బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం

**వెల్దుర్తి, డిసెంబర్18 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని తహశీల్దార్ తులసీరాం, ఆర్ఐ జయభారత్‌రెడ్డిల నిర్వహించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఓటరు లీస్టును జాగ్రత్తగా పర్యవేక్షించాలన్నారు. రెండు చోట్ల ఓటు ఉంటే ఒక చోట తొలగించాలని, ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు లీస్టును సరిచూసుకోవాలన్నారు. నూతన ఓటర్లను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని బీఎల్‌వోలు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న బీఎల్‌వోలు

## కొండా సురేఖ నేతృత్వంలో దేవాలయాలు మరింత అభివృద్ధి చెందుతాయి

**-టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం**



అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 18, ప్రభాతవార్త :** అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొండా సురేఖను టిపిసి సభ్యులు దరిపల్లి చంద్రం హైదారాబాద్‌లోని అమె కార్యాలయంలో కలిసి పూల మొక్కను అందించి అభినందనలు తెలిపారు. కొండా సురేఖ నేతృత్వంలో దేవాలయాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు.

## న్యాల్‌కల్‌లో బోనాల సందడి



న్యాల్‌కల్‌లో శ్రీమల్లికార్జున స్వామికి బోనాలు తీస్తున్న భక్తులు

**న్యాల్‌కల్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో సోమవారం శ్రీ మల్లికార్జున స్వామికి బోనాలను భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అడపడుచులు అత్తారిండ్ల నుంచి తమ పిల్లా పాపలతో గ్రామానికి చేరుకుని ఉత్సవాల్లో పాల్గొనడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. పోతురాజుల విన్యాసాలతో భక్తులు స్వామ వారికి బోనాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ప్రసాద వితరణ (అన్నదానం) నిర్వహించారు. రాత్రికి మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి బాధ్యులు పేర్కొన్నారు.

## పరిశుభ్రతకు నోచుకోని సంగాయిపేట ప్రభుత్వ పాఠశాల

**-టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సుల్తానగారి కృష్ణ మాదిగ**



పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం

**కొల్చారం, డిసెంబర్18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంగాయిపేట గ్రామంలోని ప్రభుత్వ పాథమిక పాఠశాలలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం కనిపిస్తుందని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సుల్తానగారి కృష్ణ మాదిగ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతతో మాట్లాడుతూ సంగాయిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గ్రామ పంచాయితీ సిబ్బంది, కారోబార్, సెక్రటరీ, పాఠశాల సిబ్బంది ఎవరు కూడా పట్టించుకోవడం లేదన్నారు. ఈ పరిస్థితి చదువుకునే పిల్లలకు ఇబ్బందికరంగా మారిందని, తక్షణమే పై అధికారులు, గ్రామ పెద్దలు పాఠశాల బాగోగులు పట్టించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## గుల్బర్గా దర్గాలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**జోగిపేట, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** కర్ణాటకలోని హజ్రత్ ఖ్వాజా బందా నవాజ్ షరీఫ్ దర్గాలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు మంత్రి రాజనర్సింహను శాలువాలతో ఘణంగా సన్మానించారు.

## నఖిలీ విలేకరులను పట్టుకొని వదిలేసిన శివ్వంపేట పోలీసులు



శివ్వంపేట పోలీసులు పట్టుకున్న నఖిలీ విలేకరులు వీరే

**శివ్వంపేట, డిసెంబర్18 ప్రభాతవార్త:** విలేకరులమంటూ వ్యాపారస్తులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు విలేకరులను శివ్వంపేట పోలీసులు సోమవారం అరెస్టు చేయడం జరిగింది. మండల పరిధిలోని కొత్తపేట శివారులో గల ఇటుక బట్టీ వ్యాపారస్తులను బెదిరిస్తూ ఇదివరకే 50 వేల రూపాయల వసూలు చేయడం జరిగిందని వారు ఒప్పుకున్నారు. అదేవిధంగా సోమవారం మరోసారి వచ్చి డబ్బులు ఇస్తారా, లేదా, లేకపోతే ఇటుక బట్టీలను ధ్వంసం చేయిస్తామని బెదిరించడం జరిగింది. ఇది గమనించిన ఇటుక బట్టీ వ్యాపారులు వారిని పట్టుకొని శివ్వంపేట పోలీసులకు అప్పగించారు. వీరిద్దరిని శివ్వంపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకురావడం జరిగింది. వీరిద్దరినీ నఖిలీ విలేకరులుగా శివ్వంపేట ఎస్ఐ రవికాంత్‌రావు విచారణ చేసి గమనించారు. శివ్వంపేట మండలంలో నకిలీ శిలేకరులుగా కొనసాగుతున్న వ్యక్తులను పట్టుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు. పోలీసులు చేస్తున్న విచారణపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ కార్యాలయానికి కూడా సమాచారం అందింది.

## జిల్లా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక



అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ ఎంపిక సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**సంగారెడ్డి మున్సిపాలిటి, డిసెంబరు 18, ప్రభాతవార్త:** అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనవరి 2024 న్యూ ఢిల్లీలో జరగబోయే 19వ జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు అండర్ 14, 16 బాల బాలికలకు జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికను జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియం మైదానంలో సోమవారం నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి జావిద్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డిఎస్‌పి రమేష్ కుమార్, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు కూన వేణుగోపాల్‌లు పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచన క్రీడాకారులను మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్‌లను అందచేశారు. కార్యక్రమంలో సదాశివపేట సిఐ నవీన్ కుమార్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ అబ్జర్వర్ మదుసూదన్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు సోహెల్ అలీ, ఆర్గనైజర్ సెక్రటరీ శశిరేఖ, కోశాధికారి రాబర్ట్ దాసన్, టిఎన్‌జిఓ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీకాంత్, స్విమ్మింగ్ కోచ్ శ్రీనివాస్‌గౌడ్, పీడీలు షర్ఫుద్దీన్, మల్లికార్జున్, కోచ్‌లు, పిఈటిలు గ్రౌండ్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామి దేవాలయంలో ఘనంగా సుబ్రమణ్య స్వామి కళ్యాణోత్సవం

**వెల్దుర్తి, డిసెంబర్18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామం వద్ద వెలసిన శ్రీ భ్రామరాంబ సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో సోమవారం సుబ్రమణ్యస్వామి కళ్యాణోత్సవాన్ని శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. అలాగే అక్కడే ఉన్న సంతాన నాగేంద్ర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రమణ్య స్వామి కళ్యాణోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి పాల్గొనటంతో భక్తులు ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో స్థానిక ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మల్లేశం, నాయకులు నర్సింలు, నర్సింహారెడ్డి, శేక్‌రెడ్డి, సత్యనారాయణ, దుర్గాగౌడ్, భక్తులు పాల్గొన్నారు.



సుబ్రమణ్య స్వామి కళ్యాణోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాధవానంద సరస్వతి స్వామి